5 APR 2019

## యానాం చేరుకున్న ఈవీఎంలు

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి పార్లమెంటరీ నియోజకవర్గం ఎన్నికకు అవసరమైన సామగ్రి ప్రత్యేక వాహనంలో డిప్యూటీ తహసీల్దారు జయచంద్రన్, పోలీసు బందోబస్తుతో గురువారం సాయంత్రం యానాం చేరుకుంది. పౌర కార్యాలయం వద్ద 36 ఎలక్ట్రానిక్ ఓటింగ్, 72 బ్యాలెట్ యంత్రాలను అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. 18 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండడంతో రెండు ఈవీఎం యూనిట్ల ఏర్పాటు అనివార్యమైంది. ఎలక్ట్రానిక్స్ ఇంజినీరు సమక్షంలో బ్యాలెట్ యంత్రాలు ర్యాండమైజేషన్ జరపాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి శివరాజ్‌మీనా, ఎస్పీ రచనాసింగ్, మున్సిపల్ కమిషనర్ గుజ్జు గౌరీసరోజ, సూపరింటెండెంట్ పెసల సూర్యనారాయణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎంఏ సిరాజుద్దీన్, ఎస్ఎం తాజుద్దీన్ బాషా, శ్రీమంతుల శ్రీధర్, కనకాల రామదాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల సామగ్రిని వాహనం నుంచి దించుతున్న సిబ్బంది

## సెన్‌టాక్ పీజీ మెరిట్ లిస్ట్ విడుదల

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ ద్వారా 2019-20 విద్యా సంవత్సరంలో మెడిసిన్, డెంటల్ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి మెరిట్ జాబితాను సెన్‌టాక్-కమిటీ విడుదల చేసింది. ఆలిండియా నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాల ఆధారంగా వచ్చిన మార్కుల్ని రిజర్వేషన్ ప్రాతిపదికన సమన్వయపరిచి విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. అర్హత పొందిన అభ్యర్థులకు ఫలితాల వివరాల్ని పంపిస్తున్నట్లు సెన్‌టాక్ ప్రతినిధి చెప్పారు.

5 APR 2019

## రీజన్సీలో ఘనంగా ఉగాది వేడుకలు...

### సంప్రదాయ దుస్తులతో అలరించిన విద్యార్థులు

యానాం, ఏప్రిల్4, ప్రభాతవార్త:

యానాం రీజన్సీ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాల విద్యార్థినీ,విద్యార్థులందరూ సంప్రదాయదుస్తులు ధరించి వేడుకలలో పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మన తెలుగుభాష, సంస్కృతి సంప్రదాయాలు చాలా గొప్పవని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ఉగాది వేడుకలు తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. పాశ్చాత్య పోకడల ప్రభావం మన సం ప్రదాయల మీద తీవ్రంగా పడుతుందన్నారు. మన తెలుగు భాష, మనసంస్కృతీ సంప్రదాయాల ప్రాముఖ్యతను, ఔన్నత్యాన్ని విద్యార్థులు గుర్తించాలని



ఉగాది వేడుకలలో పంచాంగశ్రవణం

కోరారు. ఈ వేడుకలలో భాగంగా ముందుగా పంచాంగ శ్రవణం నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యార్థులందరూ సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

5 APR 2019

## యానాం చేరుకున్న ఈవీఎంలు

### ● స్ట్రాంగ్ రూమ్‌లో భద్రం

యానాం, ఏప్రిల్ 4:

ఈ నెల 18 జరగనున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా గట్టి బందోబస్తు నడుమ గురువారం ఈవీఎంలు యానాం చేరుకున్నాయి. ఈవీఎంలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శివరాజ్‌మీనా, ఎస్పీ రచనాసింగ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించారు. అనంతరం వాటిని స్థానిక మినీ సివిల్ స్టేషన్ ప్రాంగణంలో గల స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.

5 APR 2019

## యానాం చేరుకున్న ఎన్నికల సామగ్రి

యానాం: పుదుచ్చేరి లోని ఏకైక లోక్‌సభ నియోజకవర్గానికి ఈనెల 18న నిర్వహించే ఎన్నికలో భాగంగా యానాంలో జరిగే పోలింగ్‌కు కావాల్సిన ఎన్నికల సామగ్రి గురువారం సాయంత్రం పుదుచ్చేరి నుంచి యానాంకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక కంటైనర్‌లో అత్యంత భద్రత మధ్య వీవీప్యాట్‌లు, కంట్రోల్‌యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లును తదితర సామగ్రిని స్థానిక మినీ సివిల్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, పరిపాలనాధికారి శివరాజ్‌మీనా, ఎస్పీ రచనాసింగ్ తదితరుల సమక్షంలో కంటైనర్ తలుపులు తెరచి అందులోని సామగ్రిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. నియోజకవర్గ పరిధిలో 36 పోలింగ్ బూత్‌లకు గాను 36 వీవీపాట్‌లు, బ్యాలెట్‌యూనిట్లు 72, 36 కంట్రోల్‌యూనిట్లు తదితర సామగ్రిని ప్రత్యేక పెట్టెలలో తీసుకువచ్చారు. వీటిని ఎన్నికల అధికారులు పూర్తిగా పరిశీలించి రాజకీయపార్టీల నాయకుల సమక్షంలో భద్రపరిచారు.

5 APR 2019

## అధికారులు పార్టీనాయకుల మధ్య ఇ.వి.ఎమ్ లు స్ట్రాంగ్ రూమ్‌కి తరలింపు

యానాం, ఏప్రిల్ 4 (జనస్పందన విలేకరి)యానాం స్థానిక ప్రాంతీయ పరిపాలనాదికారి కార్యాలయానికి అనుకొనిఉన్న మినీ సివిల్ స్టేషన్ నందు పుదుచ్చేరి నుండి ప్రత్యేక వాహనంలో ఇ.వి.యమ్‌లను యానాం తరలించారు. వీటిని ఎన్నికల అధికారి శివరాజ్ మీనన్, ఎస్.పి.రచనా సింగ్, మున్సిపల్ కమీషనర్ జి.గౌరీ సరోజ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సిరాజుద్దీన్, బి.జే.పి నాయకుడు రామ్ దాస్, ఎన్.ఆర్.పార్టీ నాయకుడు శ్రీమంతుల శ్రీధర్ మరియు ఇతర పార్టీనాయకులు, ఇతర అధికారులు పోలీసు బందోబస్తుల మధ్య ఇ.వి.ఎమ్‌లు స్ట్రాంగ్ రూమ్‌కి తరలించి బద్రపరిచారు.

ఈనాడు 5 APR 2019

# ఓటు హక్కు.. ఎక్కుపెట్టు

### ఆనందంగా ఉంది..



కొత్తగా ఓటు హక్కు వచ్చిన ఏడాదే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం రావడం ఎంతో ఆనందంగా, ఒక రకమైన ఉత్కంఠ కల్గిస్తోంది. తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకుంటా. ఓటు ప్రాధాన్యంపై మా కుటుంబ సభ్యులకు తెలియజేస్తా.

-మేడా సునీల్

### చక్కని అవకాశం..



సమర్థులైన వ్యక్తుల్ని ఎన్నుకోవడానికి ఓటు ప్రతి పౌరుడికీ ప్రభుత్వం కల్పించిన చక్కని అవకాశం. ప్రలోభాలకు గురికాకుండా అంతా ఓటును సద్వినియోగం చేసుకోవాలి. సమర్థులైన నేతల్ని పార్లమెంటుకు పంపించాలి.

-పెసింగి స్వామి

యానాం, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్య వ్యవస్థను చక్కగా నడిపించేందుకు అవసరమైన సమర్థులైన పాలకులను ఎన్నుకోవడానికి ప్రభుత్వం 18 ఏళ్లకే యువతకు ఓటుహక్కు కల్పించిందని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ లంక చంద్రరావు అన్నారు. జాతీయ సేవా పథకం ద్వారా ఐటీఐ విద్యార్థులకు గురువారం ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని వివరించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం, వీవీ ప్యాట్ వినియోగం, ఓటు వేసేందుకు వెంట తీసుకెళ్లాల్సిన పత్రాలు, పోలింగ్ కేంద్రాల్లో అధికారుల పని విధానాన్ని చంద్రరావు వివరించారు. కేంద్ర ప్రభుత్వం 90 కోట్ల జనాభాకు ఎన్నికల ప్రక్రియ నిర్వహణ కోసం వేల కోట్ల ప్రజాధనాన్ని వెచ్చిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ సేవాపథకం సమన్వయకర్త చింతపల్లి కృష్ణసుధాకర్ ఓటు ఎంతటి విలువైనదో వివరించారు. ఓటును అమ్ముకున్న వారు తర్వాత ప్రశ్నించే హక్కును కోల్పోతారన్నారు. ఈ సమావేశంలో బచ్చలి విద్యాసాగర్, జాతీయ సేవాపథకం ప్రోగ్రాం ఆఫీసర్ కె.అరుణకుమారి, లంక ప్రసాదరావు, వాసంశెట్టి ఆనంద్ పాల్గొన్నారు.



ఓటు హక్కు గురించి అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

### మంచి పాలకులతోనే మంచి భవిత..



ఓటుహక్కు విలువ గురించి ప్రజలకు ప్రభుత్వం అవగాహన కల్పించాలి. ఎన్నిక లంటే మద్యం, ధనం వంటి ప్రలోభాలతో లబ్ధి పొందవచ్చన్న ఆలోచన మంచిది కాదు. మంచి పాలకులు ఉంటేనే యువతకు ఉద్యోగావకాశాలు లభించి మంచి భవిత దక్కుతుందన్న విషయం తెలుసుకోవాలి.

-మల్లాడి పవన్‌కల్యాణ్

### ఓటు వజ్రాయుధం...



అవినీతిపరులు, అసమర్థులైన నేతల్ని పక్కన పెట్టడానికి ఓటు ఒక చక్కని ఆయుధం. అయిదేళ్లకోసారి వచ్చే ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. మంచి మార్పు తేవడానికి ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి. అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.

-పలివెల కిషోర్‌కుమార్

## యానాంలో ఉగాది వేడుకలు రేపు

యానాం: కళలు, సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో యానాంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో వికారి నామ సంవత్సర ఉగాది వేడుకలు శనివారం సాయంత్రం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పంచాంగ పఠనం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

## 270 సీసాల మద్యం స్వాధీనం

సావిత్రినగర్(యానాం), న్యూస్‌టుడే: అక్రమంగా మద్యం తరలిస్తున్న కొందరు వ్యక్తులను వెంబడించగా వారు సరకు వదిలేసి పారిపోయిన ఘటన సావిత్రినగర్‌లో బుధవారం రాత్రి ఒంటిగంట సమయంలో చోటు చేసుకుంది. సావిత్రినగర్ ప్రాంతంలో మద్యాన్ని తరలిస్తుండగా వారిని కొంకే రవికుమార్ ఆధ్వర్యంలో గమనించిన ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది వెంబడించారు. వారు మద్యం సీసాలను వదిలేసి పరారయ్యారు. పట్టుకున్న మద్యాన్ని యానాం ఎక్సైజ్ శాఖ అధికారులకు అప్పగించారు. ఐ.పోలవరం మండలం భైరవపాలెం వైపునకు తరలించేందుకే వీటిని తెచ్చి ఉంటారని భావిస్తున్నారు.

## నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి

యానాం, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ప్రతి ఒక్క పోలీస్ ఉద్యోగి అప్రమత్తంగా ఉండాలని, మోడల్ కోడ్‌ను కచ్చితంగా అమలుచేయాలని పుదుచ్చేరి ఐజీపీ సురేంద్రకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో యానాంలో శాంతిభద్రతలను పరిశీలించేందుకు పుదుచ్చేరి నుంచి రోడ్డు మార్గంలో బయల్దేరిన ఐజీపీ యానాంకు గురువారం రాత్రి 10 గంటలు సమయంలో చేరుకున్నారు. వెంటనే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి యానాం పరిపాలనాధికారి శివరాజ్‌మీనా, ఎస్పీ రచనాసింగ్‌లతో కలిసి పోలీసులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతిఒక్కరూ రాగద్వేషాలు లేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలన్నారు. కొందరు పక్షపాతంగా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, పనితీరును మార్చుకోవాలన్నారు. యానాంలో పనిచేస్తున్న పోలీసులంతా గతంలో ఎన్నికల విధుల్లో పనిచేసిన అనుభవజ్ఞుల్లాగా కనిపిస్తున్నారని విధుల్ని సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్, తనిఖీలు, తదితర అంశాల గురించి పోలీసులను ప్రశ్నలు అడిగారు. సమావేశంలో సీఐ ఆర్.భక్తవత్సలం, ఎస్సైలు సురేష్, శేరు నూకరాజు బృందం పాల్గొన్నారు. శుక్రవారం యానాంలో పర్యటిస్తానని తెలిపారు.



పోలీసులు నిర్వహించాల్సిన విధుల గురించి కానిస్టేబుల్‌ను ప్రశ్నిస్తున్న ఐజీపీ (మధ్యలో వ్యక్తి)

### పది కంపెనీల పారామిలటరీ బలగాలు

పార్లమెంటు ఎన్నికల విధుల నిమిత్తం 10 కంపెనీల పారా మిలటరీ దళాలను వినియోగించనున్నట్లు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు పారా మిలటరీ కంపెనీలను మాత్రమే విధులకు ఉపయోగించామన్నారు. యానాం, మాహే లకు ఒక్కో కంపెనీ, కారైకాల్ -2, పుదుచ్చేరిలో - కంపెనీల పారా మిలటరీని వినియోగిస్తామన్నారు. యానాం ప్రశాంతమైన నియోజకవర్గమని ఎలాంటి అల్లర్లు లేకుండా ఎన్నికలు సజావుగా పూర్తి చేయడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.